
# తూ...తూ...మంత్రం

—అమృత




అప్పుడే మెలకువ వచ్చిన గణవతి, ఆవేళ ఆదివారమని గుర్తుకొచ్చి కళ్లు మూసుకుని బద్ధకంగా అలాగే వడుకున్నాడు!

బామ్మ అప్పుడే స్నానం చేసేసి నట్టుంది. వంటింట్లోంచి భజగోవింద శ్లోకాలు వినిపిస్తున్నాయి. ఎనభై ఏళ్ల బామ్మ. గడ్డకట్టించే చలిలో కూడా చన్నీళ్ల స్నానం ఎంత అవలీలగా చెయ్యగలదో. చక్కటి గమకాలు వలికిస్తూ భజగోవింద శ్లోకాలూ, శివానంద లహరి శ్లోకాలూ, భజనలూ కూడా అంత రమ్యంగా పాడగలదు! బామ్మ ఆలోచనలకీ, అభిప్రాయాలకీ, గణవతి ఊహాలకీ ఆశయాలకీ ఎక్కడా పొంతన వుండదు! బామ్మ అతి చాదస్తపు మనిషి! బ్రాహ్మణేతరులకి యింట్లో విస్తరి వెయ్యటం మాట అటుంచి, తన చేత్తో గుక్కెడు కాఫీ కూడా యివ్వదు! అయితేనేం. వెన్నెలాంటి మనసున్న మనిషి! వేసవి వచ్చిందంటే, పొద్దున్నే వనిమనిషి చేత, వీధి వరండాలో కుండతో నీళ్లూ, వక్కనే ఒక రెండు ప్లాస్టిక్ గ్లాసులూ పెట్టిస్తుంది! అదే వీధిలో వున్న స్కూలు పిల్లలు మిట్ట మధ్యాహ్నం యిళ్లకు వెళుతూ దాహం వేస్తే బామ్మ దగ్గరకే వస్తారు! ఆవిడ లోపలి గుమ్మంలో వత్తులు చేసుకుంటూ, "అవిగో కుండెడు నీళ్లు! కావలసినన్ని తీసుకు తాగండ్రా!" అంటుంది! గణవతిని మాత్రం ఆ కుండ పొరపాటుగా నైనా ముట్టుకోనివ్వదు!

ఇక గణవతి, కులం, మతం అంటే యింతెత్తున లేస్తాడు! సాక్షాత్తూ శంకరాచార్యుల వారే సర్వమానవ నమానత్వం బోధించారని ఉదాహరణలతో నహా ఉపన్యాసాలిస్తాడు! భగవంతుడిదే కులమని ప్రశ్నిస్తాడు! ఒకరి కొకరు తప్ప, యింకెవరూ లేని ఇటువంటి బామ్మా మనవళ్లిద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రాణం! తన అభిప్రాయాలు ఏవైనా బామ్మ అభీష్టానికి వ్యతిరేకంగా ఏదీ చెయ్యడు గణవతి! గణవతి పీల్చే వూపిరే తన వూపిరిగా బ్రతుకుతుంది బామ్మ!

వంటింట్లో బామ్మ శ్లోకాలు అనర్గళంగా సాగి పోతున్నాయి! కళ్లు మూసుకుని వాటిని తన్మయంగా వింటున్న గణవతి, వక్కవాటా లోంచి వినిపించిన కేకలతో, ముఖం చిట్లించి విసుగ్గా మంచం దిగాడు!

"నా ఇష్టం వచ్చినట్టు నేను చేస్తాను! ఇది నా ఇల్లు! నంపాదిస్తున్నది నా మొగుడు! ఇష్టంవుంటే వుండండి, లేకపోతే మీముద్దుల కూతురి దగ్గర కెళ్లండి! అంతేగాని యిలా చీటికీ మాటికీ కలగ జేసుకుంటే మాత్రం నహించేది లేదు!' వక్కవాటా కోడలు పెద్దగొంతు పెట్టుకుని అరుస్తోంది! ఆవిడ గొంతు తప్ప యింకెవరి గొంతూ వినబడటం లేదు! అవును, ఎలా వినిపిస్తుంది! తిట్లు తింటున్న అత్తగారు మరి నోరెత్తలేదు! మామగారు పావం భార్యని కోడలు తిడుతుంటే నహించలేరు. కొడుకూ కోడలు ఎక్కడ యింట్లోంచి గెంటేస్తారో నని ముసలావిడే ఆయన నోరు నొక్కేస్తుంది! ఇక ముసలావిడ కొడుకు పూర్తిగా భార్యా విధేయుడు! అంచేత పెళ్లాం ఎంతలా అరుస్తున్నా తనకేమీ పట్టనట్టు ఊరుకుంటాడు.!

వక్క దిగిన గణవతి, వక్కవాటా వృద్ధ దంపతుల మీద జాలి వడుతూ, పెరట్లోకి బైలుదేరాడు! వంటింట్లోకి వచ్చేసరికి బామ్మ మౌనంగా కుంపటి విసురుతూ కనిపించింది! ఆవిడని చూసేసరికి, వక్క వాటా లోంచి కేకలు వినిపించగానే, బామ్మ చదువుతున్న శ్లోకం కూడా ఆగిపోయిందని గుర్తొచ్చింది గణవతికి!

"శ్లోకాలు ఆపేశావేం బామ్మా?" అన్నాడు.

వినురుతున్న బామ్మ తలెత్తి చూస్తూ, "ఒక వక్క శ్లోకాలు వినిపిస్తుంటే మరోవక్క శ్లోకాలు ఎలా సాగుతాయిరా?" అంది.

గణపతి మాట్లాడకుండా వెళ్లి ముఖం కడుక్కుంది. వచ్చి బామ్మకి కాస్త ఎడంగా కూర్చున్నాడు!

మనవణ్ణి చూస్తూనే సిద్ధం చేసి వుంచిన కాఫీ గ్లాసు అతని వైపు నేలమీద పెడుతూ, "రేపు ఫస్టుకి పక్క వాటావాళ్లని ఖాళీ చేసెయ్యమని చెప్పేస్తానురా" అంది.

ఎప్పుడో ఒకప్పుడు బామ్మ నోటినించి యిలాంటి మాటలు వస్తాయని ఊహిస్తున్నప్పటికీ ఒక్కసారి చకితు డయ్యాడు గణపతి.

అతడి ఆశ్చర్యాన్ని పట్టించుకోకుండా, "అవునురా! ఆ ముసలావిడ పడుతున్న రంపపు కోత కళ్లారా చూస్తూ భరించలేక పోతున్నాను! పేదరికంలో మగ్గి పోతూ కూడా ఉన్న ఆ ఒక్క కొడుకునీ అపురూపంగా పెంచటానికి వాళ్లు ఎంత శ్రమ పడ్డారో ఆవిడ ఎన్ని సార్లో నాకు చెప్పింది! జీవితమంతా కష్టపడ్డ మనుషులు, వృద్ధాప్యం వచ్చాక, తమ వాళ్ల మధ్య వాళ్ల ప్రేమాభి మానాలతో, విశ్రాంతిగా బతకాలనుకుంటారు! ఒంట్లో శక్తి ఉడిగిపోయి, చేతిలో డబ్బులేక, రక్తసంబంధీకులు పెట్టే బాధలు భరిస్తూ, వాళ్ల విదిలించే మెతుకులు కతుకుతూ... ఆ బాధ పగవాళ్లకి కూడా వద్దు నాయనా!" అంటూ తన ఆవేదన అంతా వెళ్ల బోసుకుంది ఆవిడ!

బామ్మ ఆవేశాన్ని చూసి ఒక్కక్షణం చలించి పోయాడు గణపతి! వెంటనే మాట మారుస్తూ, హాస్యంగా, "చూశావా! అందుకే నేను కులాలు మతాల కంటె మనుషులే గొప్ప వాళ్లంటాను! పక్కింటి ముసలావిడ బంధువుల పిల్లనే కోడల్ని చేసుకుని యిన్ని బాధలు పడుతోంది! రేపు మరేదైనా కులానికి చెందిన అమ్మాయి నన్ను పెళ్లి చేసుకుని, నిన్ను పువ్వుల్లో పెట్టుకుని చూసుకుందనుకో. అప్పుడే మంటావ్?" అన్నాడు.

అతడు వూహించినట్టే బామ్మ తన బాధంతా మర్చిపోయి, నవ్వుతూ, "భడవా, నువ్వు తెలివైన వాడివే గాని, నన్ను బురడీ కొట్టించలేవురా?!" అంది. గణపతి కూడా నవ్వి "ఏం?" అన్నాడు. "ఈ ఒక్క కోడలూ యిలా చంపుకు తింటోందని కులాన్నే వెలేస్తామా? ఆచారిగారి కోడల్ని చూడు. ఆ పిల్లకి అత్తమామలంటే ఎంత అభిమానం, గౌరవం వున్నాయో? మడీ ఆచారం చక్కగా పాటిస్తుంది. మహాలక్ష్మమ్మ కోడలు చూడు. ఉద్యోగం చేస్తున్నా పిసరంత గర్వం కూడా లేదు! ఎంత అణకువా,ఎంత విధేయతా..." "అవు తల్లీ, అవు!" గణపతి చేతులెత్తి దండం పెట్టాడు. "నీ కోడళ్ల దండకం చాలుగానీ...బామ్మా! నాకో ప్రగాఢమైన కోరిక వుంది!"

"ఏమిట్రా, అది?" బామ్మ ఆసక్తిగా ప్రశ్నించింది.

"కులం, మతం అంటూ పాకులాడకుండా, చక్కగా చదువుకుని, నీలా రాగయుక్తంగా శ్లోకాలు చదువుతూ, నిన్ను అభిమానంగా చూసుకునే అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని వుంది!"

మనవడికి తన మీదవున్న అభిమానానికి బామ్మ కళ్లు చెమర్చాయి! అయినా, ఆవిడ మనవడి పాయింటుని గ్రహించి, చప్పున కొంగుతో కళ్లు ఒత్తేసుకుంటూ "దానికేం భాగ్యంరా వెర్రి నాగన్నా! అలాంటి పిల్లలు కావలసినంత మంది వున్నారు! అంతెందుకు, సావిత్రి, దాని కూతురు గిరిజని నీకిస్తానని ఏడాది నించి మనింటి చుట్టూ తిరుగుతోంది! నువ్వు ఊఁ అనడమే తరవాయి! పిల్ల నువ్వు కోరినట్టు చక్కగా పాడుతుంది కూడాను!"

తను వేసిన బాణాన్ని కూడా బామ్మ తిప్పి పారెయ్యటంతో ఉక్రోషంగా లేచి నిలబడ్డాడు గణపతి!


"అఁ, ఆ పిల్లని పెళ్లి చేసుకుని, ఆవిడ గారి పాటలు వింటూ తరిద్దాం! లేకపోతే, ఆవిడగారు శయనించాక, శ్రీదేవి, భూదేవిలా నువ్వూ నేనూ చెరోకాలూ పడదాం! ఆ సావిత్రమ్మ నిన్నేమైనా కాకా పడుతుందేమో, యిప్పుడే చెబుతున్నా నేనాగిరిజని మాత్రం, నా కంఠంలో ప్రాణం వుండగా చేసుకోను!' అంటు ఖచ్చితంగా చెప్పేసి, గబగబా ముందు గదిలోకి వెళ్లిపోయాడు!

మనవడి కోపానికి నవ్వుకుంటూ పనిలో నిమగ్న మైంది బామ్మ.

* * *

చెప్పినట్టే ఫస్టుకల్లా పక్కవాటా ఖాళీ చేయించేసింది బామ్మ! రెండు వాటాలున్న ఆ యింటి గేటుకి, 'టులెట్' అన్న అట్టబోర్డు, గణపతిచేత తగిలిపించింది!

టు-లెట్ బోర్డు పెట్టిన రోజు సాయంత్రమే, బామ్మ, యింటి ముందు అరుగు మీద కూర్చుని, పక్కింటి మహాలక్ష్మమ్మతో కబుర్లు చెబుతుండగా, గేటు తీసుకుని, యిరవై - యిరవై రెండేళ్ల ఒక అమ్మాయి లోపలికి వచ్చింది.



**కథ - కట్టుకథ**

ఆఫీసునుంచి త్వరగా ఇంటికి వచ్చే భర్త — "ఈ సాయంత్రం చదవడానికి కొత్త కథల పుస్తకాలు ఏమిటబ్బా" అని ఆలోచిస్తాడు.

అదే ఆలస్యంగా వచ్చినప్పుడు — "నేను ఇవాళ చెప్పడానికి కొత్త కట్టుకథ ఏమిటబ్బా" అని ఆలోచిస్తాడు!

భుజాల చుట్టూ కొంగు కప్పుకుని కొంగు మీదుగా హేండ్ బాగ్ తగిలించుకుని, అలసి పోయిన ముఖంతో వస్తున్న ఆ అమ్మాయివైపు ఆసక్తిగా చూస్తూ, "ఎవరు కావాలమ్మా" అని ప్రశ్నించింది బామ్మ.

ఆ అమ్మాయి కొంచెం తడబడుతూ టు-లెట్ బోర్డు వైపు చూపిస్తూ, "అ బోర్డు చూసి వచ్చానండీ! ఇల్లు కావాలి!" అంది.

"ఓహెూ. అలాగా! బాగానే వుందిగాని, మరేలా అనుకోకపోతే, నీ కులం ఏమిటో చెబుతావా?"

బామ్మ ప్రశ్నకు ఆ అమ్మాయిల పెదవులు తడి చేసుకుంటూ, "బ్రాహ్మణుల మండీ!" అంది.

ఆ మాట వినగానే బామ్మ ముఖం ప్రసన్నమైంది!

అయినా, సంతృప్తి పడకుండా 'బాగుందమ్మా! మీ యింటిపేరేమిటి?" అంది.

"రాయవరపు వారండీ!" అ అమ్మాయి టీచర్ ముందు చేతులు కట్టుకుని జవాబు చెబుతున్న చిన్న పిల్లలా వినయంగా చెప్పింది.

'అంటే నియోగులన్నమాట! మా శాఖే కూడాను!' బామ్మ సంతృప్తి పడుతూ, "ఎవరెవరు ఉంటా రమ్మా' అని ప్రశ్నించింది.

ఆ ప్రశ్నతో ఆ అమ్మాయి ముఖంలో కళ తగ్గింది.

'నేనొక్కర్తినే వుంటానండీ' అంది తల వంచు కుంటూ.

బామ్మ ఆశ్చర్యపోతూ, "ఏమిటీ? నువ్వొక్కర్తివే వుంటావా?? మరి మీ వాళ్లో?" అంది.

ఆ అమ్మాయి కళ్లల్లో నీళ్లు తిరిగాయి!

'నాకెవరూ లేరండీ! అమ్మా నాన్నా చిన్నప్పుడే పోయారు! అన్నదమ్ములూ అక్కచెల్లెళ్లూ లేరు! మా మామయ్యే నన్ను పెంచాడు! ఆయనా యి మధ్యే పోయాడు! ఇంక యీలోకంలో నాకు నా అన్నవాళ్లెవరూ లేరు!' వణుకుతున్న గొంతుతో చెప్పింది.

ఆ అమ్మాయి మాటలతో బామ్మా మహాలక్ష్మమ్మా యిద్దరూ జాలిపడ్డారు!

"అయ్యో, నిలబడే వున్నావు. యిలా కూర్చోమ్మా" అంటూ అరుగుమీద తనకి దగ్గరగా కూర్చోబెట్టుకుని ఆ అమ్మాయి వివరాలన్నీ రాబట్టింది బామ్మ.

ఆ అమ్మాయి పేరు శ్రీలక్ష్మి! ఏదో ప్రైవేట్ కంపెనీలో టైపిస్టుగా పనిచేస్తూ తన పొట్ట తనే నింపుకుంటోంది! తన కొలీగ్ ఒకమ్మాయితో కలిసి ఒక పోర్షన్‌లో వుండేది! ఆ అమ్మాయి యీ మధ్యనే పెళ్లి చేసుకుని వెళ్లి పోయిందట! ఒంటరిగా వుండటం చూసి ఇంటిగల వాళ్లబ్బాయి నానా పోకిరి వేషాలూ వేస్తున్నాడుట! "నాకు దిక్కూ మొక్కూ ఎవరూ లేక పోవటం ఆ వెధవకి మరీ అలుసుగా వుందండీ! అందుకే సాధ్యమైనంత త్వరగా ఆ యిల్లు ఖాళీ చేసేసి మరో చోటికి వెళ్లిపోదామని వుంది! పక్కన మీ బోటి వాళ్లుంటే నా లాంటి ఒంటరి పక్షికి కొండంత ధైర్యంగా వుంటుంది. బామ్మగారూ! ఒక్కర్తినే వుంటానని సందేహించక నాకు యిల్లు యిచ్చి పుణ్యం కట్టుకోండి!" అంటూ ప్రాధేయ పడింది శ్రీలక్ష్మి.

ఆ మాటలతో మరింత కరిగిపోయింది, బామ్మ.

మహాలక్ష్మమ్మ మాత్రం, "దానికేముందమ్మా ఒంటరి మగవాడుంటానంటే బెంగగాని, ఆడపిల్లవి నీకు యిల్లు యివ్వటానికి బాధేముంది? ముందు యిల్లూ, అద్దె నీకు నచ్చనీ!" అంది.

"ఆ బాధే మీలేదండీ! ధైర్యంగా వుండ గలిగే చోటయితే, యిల్లు ఎలా వున్నా సర్దుకుపోగలను! అద్దె కూడా ఎంతయినా ఫర్వాలేదు. సంపాదించే దంతా ఖర్చు పెట్టుకునేది నేనేగా?" అంది శ్రీలక్ష్మి.

"సరే, అయితే నీకు యిల్లు యిచ్చినట్టే! రా, చూపిస్తాను!" అంటూ లేచింది బామ్మ.

మహాలక్ష్మమ్మ శెలవు తీసుకుంది.

తాళాలు తీసుకొచ్చిన బామ్మ, యిల్లు చూపిస్తూ, "అన్నట్టు యింకో విషయం తల్లీ! నీ పరిస్థితిని బట్టి ముందే చెబుతున్నాను!" అంది.

శ్రీలక్ష్మి ఆతృతగా "ఏమిటి బామ్మ గారూ?" అంటూ ప్రశ్నించింది.

"నాకు ఓ మనవడున్నాడు! బేంకులో పెద్ద ఆఫీసరు! ఇంకా పెళ్లి కాలేదు! అయితే మనిషి రత్నం లాంటి వాడు! మీ యింటి గల వాళ్ల కుర్రాడిలా ఏ వేషాలూ వెయ్యడు! అది మాత్రం నేను హామీ యిస్తున్నాను!"

బామ్మ మాటలకి శ్రీలక్ష్మి పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి!

"ఇంకా ఏదో అనుకుని ఖంగారు పడ్డాను! ఫరవాలేదు బామ్మ గారూ! మీరు చెబుతున్నారు గదా, మీ మనవడు రత్నం లాంటి వాడని!" అంది.

"అదేనమ్మా, ఎందుకైనా మంచిదని ముందే చెప్పాను! అయితే ఎల్లుండి దశమీ శుక్రవారం మంచిది. ఆ వేళ చేరతావా?"

"ఆఁ! శుక్రవారం, శనివారం రెండు రోజులూ శెలవు పెట్టి శుక్రవారం చేరిపోతాను! సోమవారాని కల్లా

ఇల్లు సర్దటం కూడా అయిపోతుంది!" అంది శ్రీలక్ష్మి.

• • •

అన్న ప్రకారమే శుక్రవారం పొద్దున్నే సామానుతో సహా వచ్చేసింనది శ్రీలక్ష్మి. ఆరోజంతా సామాను సర్దుతూనే వుంది! బామ్మ మధ్యలో ఒకటి రెండు సార్లు వెళ్లి ఇల్లు పొందిగ్గా సర్దుతున్న తీరునీ వంటింటి పక్కనే వున్న చిన్న దేవుడి గదిలో పెట్టిన దేవుడి ఫొటోల్నీ భగవద్గీతనీ చూసి మెచ్చుకుంది.

మర్నాడు శనివారం, ఎప్పటిలాగే తెల్లవారు ఝామునే లేచి, స్నానాదికాలూ, పూజా పునస్కారాలూ పూర్తి చేసుకుని, తులసిమొక్క మొదట్లో నీళ్లు పోద్దామని బైటికి వచ్చిన బామ్మ, తులసికోట దగ్గర శ్రీలక్ష్మిని చూసి ఆగిపోయింది!

తలంటు కున్న బారెడు జుట్టు కొనలు ముడి పెట్టుకుని, ఎర్రటి నారచీర కట్టుకుని పసుపు రాసు కున్న పచ్చటి పాదాలతో, కళ్లు మూసుకుని చేతులు జోడించి బాల సూర్యుడికి అభిముఖంగా నిలబడి నిశ్శబ్దంగా ఏదో చదువుతోంది శ్రీలక్ష్మి! ఆమె భృకుటి మధ్యంలో మెరుస్తున్న ఎర్రటి కుంకుమ మీద, ఉదయ సూర్యుడి కిరణాలు పడి, ఆమె ముఖం మరింత దీప్తివంత మవుతూంది!

చూడ ముచ్చటైన ఆ దృశ్యాన్ని చూస్తూ, మై మరచి పోయినట్టు అలాగే నిలబడి పోయింది బామ్మ.

కొద్ది సేపటి తర్వాత కళ్లు తెరిచిన శ్రీలక్ష్మి బామ్మని చూస్తూనే ఖంగారుగా పక్కకి తప్పుకుంటూ, "అయ్యో, మీరు నిలబడిపోయారా?! యి వేళ శనివారం కదా! అందుకని...." అంటూ నసిగింది.

బామ్మ నవ్వుతూ, "ఫర్వాలేదమ్మా? నిన్ను యిలా చూస్తుంటే, నేను పూజ చేసినప్పటి కంటే తృప్తిగా వుంది!" అంది మనస్ఫూర్తిగా.

శ్రీలక్ష్మి నవ్వి, యింట్లోకి వెళ్లిపోయింది!

మరి కాసేపటి తర్వాత అలవాటు ప్రకారం బామ్మ కుంపటి విసురుతూ, శివానందలహరి చదువుకోబోతూ ఆగిపోయింది.

ప్రక్క వాటా వంటింటిలోంచి, మృదు మధుర స్వరంతో బసవతత్త్వం ఆలపిస్తోంది శ్రీలక్ష్మి.

ఏమి సేతురా లింగా<br>
గంగ ఉదకము తెచ్చి నీకు<br>
లింగ పూజా సేతమంటే<br>
గంగ నున్నా చేప కప్పా<br>
ఎంగి లంటున్నాయి లింగా

బామ్మ కుంపటి విసరటం కూడా మర్చి పోయి వింటూ వుండిపోయింది.

"బామ్మ, పాలు పొంగిపోతున్నాయి..." అంటూ వెనక నించి వినిపించిన గణపతి మాటలతో తెప్పరిల్లి, చెమర్చిన కళ్లు తుడుచుకుంటూ, "ఆహా! నక్కల ఊళల స్థానంలో కోయిల పంచమ స్వరం చోటు చేసుకుందిరా!" అంది.

"ఆ అమ్మాయి పాట గురించేనా...." ముఖం తుడుచు కుంటూ అడిగాడు గణపతి.

బామ్మ అవునన్నట్టు తల వూపింది.

"పాటే కాదురా, ఆ పిల్లే ఒక మంచి ముత్యం! చక్కటి రూపం, రూపానికి తగ్గ ఒద్దిక, వినయం... ఆ ప్రవర్తన... అసలు యీ కాలపు పిల్ల కానే కాదు!" అంది.

"ఆహా, ఆవిడగారు ఓ పాట పాడి, కాస్త దేవుడికి దండం పెట్టేస్తే చాలు, అంత మంచిదయిపోయిందేం?" గణపతి వెక్కిరించాడు.

"చాల్లేరా, ఆ పిల్ల గురించి నీకేం తెలుసు? ఇదిగో, సందర్భం వచ్చింది గాబట్టి చెబుతున్నాను. నువ్వు మాత్రం ఆ పిల్ల జోలికి పోమాకు! ఆ పిల్ల కనిపిస్తే చప్పున ఇంట్లోకి తప్పుకో! ఇంతకు ముందున్న యింటి గల వాళ్ల కుర్రాడు ఏవో వెధవ్వేషాలు వేశాడనే..."

బామ్మ మాటల్ని మధ్యలోనే ఆపు చేస్తూ, కోపంగా లేచి నిలబడ్డాడు గణపతి. "చాల్లే, యింతోటి గుణ సుందరీ నాకు దొరకదని నేను నీ మా లక్ష్మి వెనకాలే పడతానా? అలాంటి వెధవ బుద్ధులు నాకేం లేవు! ముందొచ్చిన చెవుల కంటె వెనకొచ్చిన కొమ్ములు



## గ్రామ సర్పంచ్ పదవిలో

## కె.జె.నాగమంజరి

విశాపట్నం పరిసరాలలో ఆనంద పురం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన వనిత శ్రీమతి కె.జె. నాగమంజరి.

స్త్రీల ఆర్థిక ప్రగతి కోసం, విశాఖ జిల్లాలో, జిల్లా యంత్రాంగం పెద్ద ఎత్తున ప్రారంభించిన, స్వావలంబన పథకం ద్వారా, బలహీన వర్గాల స్త్రీలను ఒకే వేదిక మీదకు తెచ్చి, వారికి ఆర్థిక సహాయం అందించడంలో శ్రీమతి కె.జె.నాగమంజరి విశేష కృషి చేశారు.

ప్రపంచ బ్యాంకు నిధులతో, ఆనంద పురం జంక్షన్ నుండి ఆనందపురం గ్రామానికి తారురోడ్ల నిర్మాణం, గ్రామంలో వలుకూడలి ప్రాంతాల్లో మంచి నీటి బోరింగులు, మహిళా మండలి భవన నిర్మాణం, మొదలైన ప్రజాహిత కార్యక్రమాలను, ఆమె సర్పంచ్‌గా ఎన్నికయిన వెటనే చేపట్టి గ్రామస్థుల ఆదరాభిమానాలు చూరగొన్నారు. అన్ని రంగాలలో స్త్రీలకు 30 శాతం రిజర్వేషనులు కల్పిస్తున్న విధంగానే, రాజకీయ రంగంలో కూడా సీట్లను కేటాయించేటప్పుడు, స్త్రీలకు 30 శాతం రిజర్వేషన్ల పద్ధతిని విధిగా అమలు చేయాలని, అప్పుడే స్త్రీలు అన్ని రంగాలలో కొనసాగ గల మనోధైర్యం ఏర్పడుతుందని, శ్రీమతి నాగమంజరి అన్నారు.

**మల్లిడి సత్తిరెడ్డి**

వాడని, ఆ పిల్ల నిన్న గాక మొన్న వచ్చిందో లేదో, నాకే బుద్ధులు చెప్పించేంత గొప్పదయింది నీకు...." అంటూ విసురుగా వెళ్లిపోయాడు.

బామ్మ నవ్వుకుంటూ తిరిగి పనిలో నిమగ్నమైంది.

• • •

పదిహేను రోజులు గడిచాయి! శ్రీలక్ష్మి బామ్మకి మరింత దగ్గరైంది! లైబ్రరీ నించి బామ్మకి కావలసిన పుస్తకాలు తెచ్చి పెట్టటం, సాయంత్రం ఆఫీసు నించి వచ్చాక కాసేపు బామ్మ దగ్గర కూర్చుని కబుర్లు చెప్పటం శ్రీలక్ష్మికి అలవాటయాయి!

ఒక సోమవారం నాడు సాయంత్రం ఏదో మాటల్లో, శ్రీలక్ష్మి "ఇవేళ రాత్రి నేను భోం చెయ్యను! యివేళ సోమవారం కదా! ఒంటి పూటే తింటాను!" అంది.

బామ్మ మెప్పుదలగా చూస్తూ, "ఎన్ని నియమనిష్టలు తల్లీ, నీకు! ఈ కాలంలో పుట్టవలసిన దానివి కావు!" అంది.

శ్రీలక్ష్మి నవ్వి, "నేను భగవంతుణ్ణి ఎందుకు పూజిస్తానో తెలుసా, బామ్మ గారూ!" అంది.

బామ్మ ఆశ్చర్యంగా, "ఎందుకు?" అంటూ ఎదురు ప్రశ్నించింది.

"నేను బ్రాహ్మణ కులంలో పుట్టానని, పూజా పునస్కారాలు చెయ్యటం నా విధి అనీ నేను యివన్నీ చెయ్యటం లేదు! భగవంతుడు ఉన్నాడో లేడో అన్న సంశయం కంటె, భగవంతుడు, ఏదో ఒక అతీతశక్తి ఉందన్న నమ్మకం మనిషికి ఎక్కువ! ఆ భగవంతుడు కరుణా మయుడు! ఆపద్బాంధవుడు! బీదా గొప్పా తేడాలూ, కుల మత తారతమ్యాలూ, మంచి చెడ్డల విచక్షణలూ కూడా లేకుండా అందరినీ రక్షిస్తాడు! అందుకే పరమ నీచుడు కూడా 'నన్ను రక్షించు భగవంతుడా' అని కష్టం వచ్చినపుడు ఏడుస్తాడు! మనవెనుక ఒక శక్తివంత మైన అండ వుందనీ, మనం ఆపదల్లో వుంటే కాపాడుతుందనీ వున్న ప్రబలమైన నమ్మకమే మనిషికి కొండంత ధైర్యాన్ని యిస్తుంది! నేను కూడా ఆ నమ్మకం తోనే ప్రార్థిస్తాను! నన్ను దిక్కు లేని దాన్ని చేసిన భగవంతుడు, నాకు రెండు పూట్లా తినడానికి యింత దొరికేలా చేసినందుకు కృతజ్ఞతతో మొకరిల్లు తాను! నాలాగే అనాథలైన వారికి, నాకంటె దౌర్భాగ్య స్థితిలో వున్న వారికి నాకు తోచిన సహాయం చేస్తూ, భగవంతుడు చేసే పనిలో అణుమాత్రమైనా నేను పాలు పంచుకోగలిగానని సంతోషిస్తాను!"

బామ్మ నోట మాటరానట్టు వింటూ వుండి పోయింది!

చివరికి కాస్త వ్యంగ్యంగా, "అయితే యీ ఒంటి పూట భోజనాలూ అవీ దేని కోసం?" అంది.

బామ్మ వ్యంగ్యాన్ని గ్రహించిన శ్రీలక్ష్మి నవ్వి, "నన్ను పెంచిన మా మామయ్య, గొప్ప శివభక్తుడు! ఆయన ప్రతి సోమవారం రాత్రి భోం చేసేవాడు కాదు! అయితే యింట్లో వంట మాత్రం యధా ప్రకారం తయారయ్యేది! ఆ పూట తను తినే భోజనాన్ని యింటి కొచ్చిన బిచ్చగాళ్లకి పంచేవాడు! "ఇంతకంటె దాన ధర్మాలు చేసే శక్తి నాకు లేదు! ఈ ఒక్క పూటా నేను మానేసి వాళ్లకి పెట్టటం వల్ల నా జీర్ణ కోశానికి ఆరోగ్యం, వాళ్ల కాలే కడుపులకి యింత అన్నం రెండూ దొరుకుతాయి!" అనేవాడు. ఆయన అలవాటే నాకూ వచ్చింది! అయితే నేను మాత్రం బిచ్చగాళ్లకి వెయ్యను! ఎందుకంటే, యీ రోజుల్లో ఎవరు నిజమైన ముష్టివాడో, ఎవరు నాటకాల రాయుడో తెలియటం లేదు! అంచేత నా ఒక పూట భోజనానికి సరిపడే సరుకుల్ని మా ఆఫీసు దగ్గర వుండే రిక్షా వాడికి యిచ్చేస్తాను! వాడికి భార్యకి రోగిష్టిది! ముగ్గురు పిల్లలు! అందరు రిక్షా వాళ్లల్లా వాడికి ఏ వ్యసనమూ లేకపోయినా వాడి రాబడి వాడికి చాలదు! ప్రతి సోమవారం నేనిచ్చే బియ్యం, కనీసం వాడి ముగ్గురు పిల్లలకి తలో ముద్దా అయినా వస్తుంది!"

ఈ సారి బామ్మకి నిజంగానే నోట మాటరాలేదు!

తెప్పరిల్లిన తర్వాత మనసులో అనుకుంది, "నువ్వు పూజలూ వ్రతాలూ చేసినా చెయ్యకపోయినా భగవంతుడు నిన్ను చల్లగా చూస్తాడు, తల్లీ!"

• • •

రోజులు గడుస్తున్నాయి! శ్రీలక్ష్మి ఆ యింటికి

వచ్చి నెల దాటింది.

ఒక ఆదివారం నాడు, ఉదయం పది గంటల వేళ, శ్రీలక్ష్మి వంటింటిట్లో ఏదో పని చేసుకుంటూండగా, పెరట్లోంచి "అమ్మో చచ్చానురా దేవుడా" అంటూ బామ్మ కేక వినిపించింది.

శ్రీలక్ష్మి చవ్వున పెరట్లోకి పరిగెత్తుకు వచ్చింది!

పెరట్లో వున్న నీళ్లకుండీ దగ్గర కాలు జారి పడిపోయిన బామ్మ, బాధతో మూలుగుతోంది!

శ్రీలక్ష్మి చవ్వున బామ్మ దగ్గరికి వెళ్లి చెయ్యి ఆసరా యిచ్చి లేవదీసి యింట్లోకి తీసుకొచ్చి పడుకోబెట్టింది.

బామ్మకాలు, నడుము పరీక్ష చేస్తూ, "వెంటనే డాక్టర్ దగ్గరకి వెళితే మంచిది బామ్మగారూ! మీ మనవడేరీ?" అంది.

"వాడు లేడే అమ్మా! ఎవరో స్నేహితుడి పెళ్లిట, పొద్దున్ననగా వెళ్లాడు. రాత్రికి గానీ రాడు!" మూలుగుతూ చెప్పింది బామ్మ.

"సరే! నేను వెళ్లి మన వీధిలోనే వున్న డాక్టర్ని తీసుకొస్తాను! మీరు కదలకుండా అలాగే పడుకోండి!" అని చెప్పి శ్రీలక్ష్మి గబగబా వెళ్లి డాక్టర్ని తీసుకొచ్చింది.

బామ్మని పరీక్ష చేసిన డాక్టర్, ఫ్రాక్చర్ ఏమీ కాలేదనీ, కాలు బెణికి వుంటుందనీ చెప్పి, నొప్పి తగ్గటానికి ఏదో ఇంజక్షన్‌చేసి, మాత్రలూ ఆయింట్ మెంటూ రాసి యిచ్చి వెళ్లిపోయాడు.

శ్రీలక్ష్మి వెళ్లి మందులు తీసుకొచ్చింది!

టాబ్లెట్ తీసి బామ్మకి యివ్వబోతూ, నీరసంగా పడుకుని వున్న బామ్మని చూసి, "ఇంతకీ మీరు భోం చేశారా?" అని అడిగింది.

బామ్మ లేదన్నట్టుగా తల వూపింది. "అయ్యో.. అయితే టేబ్లెట్ భోంచేసి వేసుకుందురు గాని! ముందు అన్నం తినండి!"

"అన్నమూ వద్దు, సున్నమూ వద్దు! పక్కమీద కదులుతుంటేనే ప్రాణం పోతున్నంత బాధగా వుంది! ఇక లేచి వెళ్లి అన్నం తినటం కూడానా? ఈ పూటకి యింత కాఫీ తాగి పడుకుంటాన్లే!" అంది బామ్మ.

బామ్మ మాటలకు శ్రీలక్ష్మి నవ్వుతూ, "అన్నం తినకపోతే మరింత నీరస పడిపోతారు! ఎముకలేం విరగలేదని డాక్టర్ చెప్పాడు గదా! సాయంత్రం మళ్లీ వచ్చి చూస్తానన్నాడు! ఈ లోపున మందులు పనిచేసి కాస్త నొప్పి సర్దుకుంటుంది! నేను వెళ్లి అన్నం కలిపి తెస్తాను! యిక్కడే స్టూలు వేసుకుని తినండి!" అంది.

బామ్మ ముందు ససేమిరా ఒప్పుకోలేదు! ప్రాణం పోయినా మంచం మీద కూర్చుని అన్నం తిననని మొండికేసింది!

చివరకి శ్రీలక్ష్మి నచ్చజెప్పగా నచ్చజెప్పగా అయిష్టంగానే ఒప్పుకుంటూ "అందుకే మన పెద్ద వాళ్లు సునాయాస మరణం కావాలని భగవంతుణ్ణి ప్రార్థించేవారు! ఒక్క పూటకే నేనింత బాధపడుతుంటే రోజుల తరబడి మంచాన పడి తీసుకునే వాళ్లు యింకెంత బాధపడతారో! నిన్న ఏకాదశి ఉపవాసం వున్నాను! యివేళ ద్వాదశి భోజనం మంచం నడుమెక్కి కూర్చుని తినే ప్రాప్తం వున్నట్లుంది! " అంది.

బామ్మ ఒప్పుకోగానే ఆవిడకి అన్నం తీసుకురావటం కోసం వంటింటివైపు కదలబోతున్న శ్రీలక్ష్మి ఆ మాటలతో ఆగిపోయింది!

• • •

వారం రోజులు గడిచాయి! బామ్మ యిప్పుడిప్పుడే పనంతా చేసుకోగలుగుతోంది! రెండు రోజులపాటు నొప్పితో బాధపడ్డ బామ్మకి సమస్త ఉపచారాలూ శ్రీలక్ష్మి చేసింది! ఒక నాలుగు రోజుల పాటు వంట కూడా శ్రీలక్ష్మికే అప్పజెప్పి, ఆమెని కూడా తమ యింట్లోనే భోజనం చెయ్యమంది బామ్మ.

పెళ్ళి నించి వచ్చాక విషయం తెలుసుకున్న గణపతి కూడా శ్రీలక్ష్మి చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు! ఆమె తమ యింట్లో తిరుగుతున్న నాలుగు రోజులూ ఆమె కంటబడకుండా బుద్ధిగా ఎడం ఎడంగా మసిలాడు!

ఒకనాడు సాయంత్రం గణపతి బేంక్ నించి వచ్చేసరికి శ్రీలక్ష్మి వాటాకి తాళం కప్ప కనిపించింది! అది చూడగానే గణపతి కనుబొమలు ముడుచుకున్నాయి! క్రితం రాత్రి, ఈ రోజు ఉదయం కూడా ఆమె జాడలేదు! ఇంటికి తాళం వేసే వుంది! రెండు రోజులుగా ఆమె ఎక్కడికి వెళ్లినట్లు!

సందేహిస్తునే బామ్మని అడిగాడు గణపతి!

## ఆడపిల్ల అంతరంగంలో....

కాలేజీకి వెళ్ళాలని గడపదాటానోలేదో–
'పైట సమంగా వేసుకో!'
పూజగదిలోంచి నాన్నమ్మకేక.
'చీకటి పడకుండా సరాసరి వచ్చెయ్,
రోడ్డు సైడు రోమియోలుంటారు!'
వంటయింటిలోంచి అమ్మ అదిలింపు
'దొంగతనాలు పెచ్చు మీరిపోయాయి
బంగారు గొలుసు అమ్మకిచ్చివెళ్ళు!'
పేపరు చదువుతూన్న కన్న తండ్రి కంఠం
ఆడపిల్లగా పుట్టినందుకు ఎన్ని హెచ్చరికలో!..
తమ్ముడిని ఆడపిల్లల కాలేజీదగ్గర
కాపలా కాయొద్దని చెప్పరేం!
అన్నయ్యని రాత్రి పదిగంటలదాకా
బార్ దగ్గర ఫ్రెండ్స్‌తో తిరగొద్దని చెప్పరేం!
అర్ధరాత్రిదాకా క్లబ్బులో పేకా డే నాన్నని
వాళ్ళమ్మా, మనమ్మా హెచ్చరించరేం!
ప్రతి ఆడపిల్ల అంతరంగంలో—
ఉదయించే ఈ ప్రశ్నలకి
జవాబులు ఇచ్చేవారు లేరేం!
ఏమన్నా అంటే—
'పురుషాధిక్యత గల ప్రపంచం' అని—
ఆడపిల్ల అంతరంగాన్ని అణచివేస్తారెందుకో!
అడుగడుగునా జవాబుల్లేని
ప్రశ్నాపత్రమే ఆడదాని జీవితమా?

—టి. ఇందిరా చిరంజీవి

ఏదో పుస్తకంలో బొమ్మలు చూస్తున్న బామ్మ తలెత్తి, "ఎక్కడికో వెళుతుంది! ఆ అమ్మాయి ఆరా నీకెందుకురా?" అంది. గణపతి మొహం ముడుచుకుంటూ, "పక్కవాటాలో వుంటున్న మనిషి గదా, రెండు రోజులుగా కనిపించలేదని అడిగాను! అదీ తప్పేనా!" అన్నాడు.

బామ్మ మళ్లీ పుస్తకంలోకి చూస్తూ, "మరి కనబడదులే! నేనే పొమ్మన్నాను!" అంది.

గణపతి ఉలిక్కిపడ్డాడు! "నువ్వే పొమ్మన్నావా! ఎందుకు? ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయిందా!" అంటూ ఆతృతగా ప్రశ్నల వర్షం కురిపించాడు. "ఏదో నీకట్టుకున్న పెళ్లాన్ని నేను తగిలేసినట్టు ఆ ఖంగారేమిట్రా? ఆ పిల్ల అసలు రంగు బైటపడింది! పొమ్మన్నాను! మరో యిల్లు దొరికేదాకా ఉంటానంది! అందాకా ఏ స్నేహితురాలింట్లోనో ఉండుగానీ నా యింట్లో మరొక్క క్షణంకూడా ఉండటానికి వీల్లేదన్నాను! వెళ్లిపోయింది!' అంది బామ్మ.

అచేతనంగా వింటున్న గణపతి, "ఏమిటీ నీకు కనిపించిన అసలు రంగు?" అన్నాడు.

"ఆ పిల్లది మన కులంకాదుట!"

"............"

బామ్మే తిరిగి అందుకుంటూ, "బ్రాహ్మణ పిల్లనని చెప్పి నన్ను మోసం చేసింది! కులం గోత్రం చక్కా ఏకరవుపెట్టి బుట్టలోవేసి ఇల్లు సంపాదించుకుంది! నిన్న ఆ పిల్ల లేనప్పుడు, తన స్నేహితురాలెవరో వచ్చి అసలు విషయం చెప్పింది! వెంటనే తగిలేశాను!" అంది.

గణపతి ఒక్కసారిగా సర్వశక్తులూ ఉడిగిపోయిన వాడిలా నేలన చతికిలబడుతూ, "ఆ అమ్మాయి నిన్నేమీ మోసం చెయ్యలేదు బామ్మా..." అన్నాడు.

బామ్మ ఏదో అనబోయింది! గణపతి ఆవిడని వారిస్తూ, 'ఆగు! నన్ను చెప్పనీ! శ్రీలక్ష్మి నిన్నేమీ మోసం చెయ్యలేదు! మోసమంటూచేస్తే చేసింది నేను!" అన్నాడు.

ఈసారి బామ్మ నోరు తెరిచింది! "అవును! శ్రీలక్ష్మిని నేను ప్రేమించాను! ఆ అమ్మాయిలో నువ్వూ నేనూ యిష్టపడే గుణాలన్నీ వున్నాయి! తను పూర్తిశాకాహారి కూడా! మాంసాహారమంటేనే అసహ్యించుకుంటుంది! అయినా నీకు కావలసిన కులపు పిల్ల కాదు! అంత మాత్రాన నేనా అమ్మాయిని వదులుకుని మరో కులమింటి కోతిని పెళ్లాడలేకపోయాను! ఇలాంటి పిల్లలు మనకులంలో లేరా అని నువ్వడగొచ్చు! కాని వాళ్లెవరూ నాకు తారసపడలేదు! ఇటువంటి అమ్మాయి మన కులం పిల్లే అయి ముందుగా నాకు పరిచయమై, మేమిద్దరం ప్రేమించుకుంటే, అంతా నీకు అనుగుణంగానే జరిగి వుండేది! నేను కులందాటి వెళ్లేవాణ్ణీ కాను!

"కాని నేను తొలుతగా యిష్టపడ్డ శ్రీలక్ష్మి నా దురదృష్ట వశాత్తూ మన కులం అమ్మాయి కాదు! ఆ మాట వినగానే నేను నీగురించే ఖంగారు పడ్డాను! కాని, చేజిక్కిన రత్నాన్ని కులం కోసం వదిలేసి, మన కులంలో మరో రత్నం కోసం వెతుక్కోవటం అవివేక మనిపించింది! ఆ మాటే శ్రీలక్ష్మితో చెప్పాను! తను ముందు ఒప్పుకోలేదు! నీకు నచ్చిన అమ్మాయినే చేసుకోమంది! నేను తనకి నచ్చజెప్పాను. తనని నువ్వు చూస్తే తప్పకుండా ఇష్టపడతావని చెప్పాను! కాని తనని నీ దగ్గరకి ఎలా తీసుకురావటమా అన్నది ఒక సమస్య అయింది! నా అదృష్టం కొద్దీ నువ్వు పక్కవాటా ఖాళీచేయించేశావు! వెంటనే నేనే శ్రీలక్ష్మిని నీదగ్గరకి పంపించాను! నువ్వు ఇంటి పేరు అదీ అడుగుతావని నాకు తెలుసు! అందుకే నీకు చెప్పవలసినవన్నీ ముందుగానే చెప్పి పంపించాను! నువ్వు తృప్తి పడి యిల్లిచ్చావు. తర్వాత శ్రీలక్ష్మి గుణగణాలు కూడా నీకు నచ్చాయి! కాలుజారి నువ్వు పడిపోయినప్పుడుకూడా తను నీకు కన్నకూతురికంటె ఎక్కువగా చేసింది! కాని నువ్వేం చేశావు? నువ్వే ఎంతో అభిమానించిన అమ్మాయిని, కేవలం కులంకోసం వెళ్లగొట్టేశావు! అలాగే కానీ! నేను తనకోసం వెళ్లను! కనీసం ఎక్కడుందో అనైనా వెతకను! కానీ ఒక్క సంగతి గుర్తుంచుకో! ఈ జన్మకి శ్రీలక్ష్మిని మర్చిపోయి యింకో అమ్మాయిని చేసుకోవటమనేది మాత్రం కలలో మాట! భార్యనేది వండిపెట్టటానికి సంసారం చెయ్యటానికే కాదు! మనసారా కలిసి జీవించటానికి కూడా! ఆ సహజీవనం నాకు ఒక్క శ్రీలక్ష్మితోనే

సాధ్యవడుతుంది! అంచేత ఇంక, నా పెళ్లిగురించి మర్చిపో!"

గణపతి లేచి మళ్లీ చెప్పులు వేసుకుని వీధిలోకి వెళ్లిపోయాడు!

తిరిగి తిరిగి దిమ్మెత్తి, రాత్రి పదిగంటలకి అతను యిల్లు చేరు కునేసరికి, యింటి తలుపులువేసి వున్నాయి!

వినుగ్గా తలుపు కొట్టాడు గణపతి! మరో నిమిషంలో తలుపులు తెరుచుకున్నాయి!

తలుపు తీసిన వ్యక్తిని చూస్తూనే గణపతి ఒక్క క్షణం తన కళ్లని తానే నమ్మలేకపోయాడు.

మరుక్షణం, "లక్ష్మీ..." అంటూ ఒక్క అంగలో లోపలికివెళ్లి శ్రీలక్ష్మిని దగ్గరకి లాక్కోబోయాడు.

అతని ఉద్దేశ్యం గ్రహించిన శ్రీలక్ష్మి చప్పున వెనక్కి జరుగుతూ, "ష్..." అంటూ లోపలికి చూపించింది.

లోపలి గదిలో మంచంమీద, వెచ్చగా దుప్పటి కప్పుకుని పడుకునివున్న బామ్మ నవ్వుతూ యిటే చూస్తోంది!

బామ్మని ఆ పరిస్థితిలో చూడగానే గణపతి మరింత తలకిందులై, చివరికి అర్థమైనట్టు తల పంకిస్తూ, "నువ్విక్కడ యిలా, ఆవిడ శేషశాయిలా నవ్వుతూ అలా...అర్థమైందిలే! ఇద్దరూ కలిసి నాటకంఆడి వుంటారు! కాని నేనెంత బాధ పడతానో మీరిద్దరూ ఆలోచించలేదు!" అన్నాడు.

శ్రీలక్ష్మి ఏమీ మాట్లాడకుండా తల వంచుకుంది!

బామ్మ మాత్రం, "మరేం ఫరవాలేదురా, ఎంతసేపూ, ఒక రెండు గంటల బాధ! అంతేగా? సుఖం విలువ మరింత పెరుగుతుంది కూడాను! నేను మాత్రం బాధ పడలేదూ! మరో కులం పిల్లని నాలాంటిది ఒప్పుకోవాలంటే ఎంత సంఘర్షణ పడాలో నువ్వేమైనా ఆలోచించావా?" అంది.

ఆ మాటలకి గణపతి చప్పునవచ్చి, బామ్మ పక్కన కూర్చుంటూ, "పోనీ ఇప్పటికైనా చెప్పు! శ్రీలక్ష్మి నీకు నచ్చిందా?" అన్నాడు.

బామ్మ నవ్వి, దుప్పటిని మరింత దగ్గరగా లాక్కుంటూ, "నచ్చలేదంటే..." అంది.

'పొమ్మందాం" తనూ నవ్వుతూ అన్నాడు గణపతి.

"అయితే నచ్చలేదు! పొమ్మను.." బామ్మ గంభీరంగా అంది.

ఈసారి గణపతికి మాటలు దొరకలేదు.

అతని అవస్థచూసి బామ్మ నవ్వుతూ, "వెర్రినాగన్నా! మనుమల విలువ నాకు యిప్పటికి అర్థమైందిరా! మనిషికోసం కులాన్ని కాలదన్నుకోగలంగానీ, కులం కోసం మనిషిని వదులుకోలేమని తెలుసుకున్నాను!" అంది.

బామ్మ మాటలు వినగానే గణపతి మొహం వికసించింది.

"థాంక్యూ బామ్మా...థాంక్స్ ఎలాట్.. ఆకలి మండి పోతోంది యిక భోంచేసి వస్తాను..." అంటూ లేచి వెళ్లబోయి, మళ్లీ ఆగి, "అవునూ, యింతకీ లక్ష్మి గురించి నీకెలా తెలిసింది?" అన్నాడు. "అదంతా లక్ష్మే చెబుతుంది. వెళ్లు! భోజనం కూడా లక్ష్మే పెడుతుంది! కడుపునిండా తిను! పో!" ఆప్యాయంగా మనవణ్ణి చూస్తూ అంది బామ్మ.

గణపతి లోపలికి నడిచాడు. శ్రీలక్ష్మి అతని వెనకే లోపలికి వెళ్లింది!

లోపలికి వెళుతూనే గణపతి చేయిజాచి శ్రీలక్ష్మిని దగ్గరకి లాక్కున్నాడు! "ష్...బామ్మగారు మేలుకునే వున్నారు! బావుండదు!" శ్రీలక్ష్మి తప్పించుకో బోయింది. "మరేం ఫరవాలేదు! ఇంతసేపూ నీకోసం ఎంతలా బాధపడ్డానో తెలుసా? నాకు నువ్వున్నావన్న నిజాన్ని ఒక్క క్షణం అనుభవించనీ..."

శ్రీలక్ష్మి మరేం మాట్లాడలేదు! మౌనంగా అతని చేతుల మధ్య ఒదిగిపోయింది.

గణపతికూడా కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు!

తర్వాత, శ్రీలక్ష్మి జడతీసి తన మెడకి చుట్టుకుంటూ, "బామ్మకి నీగురించి ఎలా తెలిసింది? నువ్వే నా చెప్పేశావు?" అన్నాడు.

శ్రీలక్ష్మి నవ్వుతూ, అవునన్నట్టుగా తల వూపింది.


"ఎప్పుడు చెప్పావు? బామ్మ ఏమంది?" కుతూహలంగా అడిగాడు.

శ్రీలక్ష్మి ఒక్క నిమిషం మాట్లాడలేదు! ఆ క్షణంలో ఆమెకి, తనగురించి బామ్మకి చెప్పబోతున్న సన్నివేశం, తను అనుభవించిన వ్యధా మళ్లీ మనసులో మెదిలాయి.

• • •

అన్నం తీసుకురావటం కోసం నవ్వుతూ బైలుదేరిన శ్రీలక్ష్మి హఠాత్తుగా విషణ్ణమైన ముఖంతో ఆగిపోవటం చూసి బామ్మ ఆశ్చర్యపోతూ, "ఏమిటమ్మా అలా ఆగిపోయావేం?" అంది.

శ్రీలక్ష్మికి ఏం చెప్పాలో ఎలా చెప్పాలో తోచలేదు! తనూ గణపతీ విశ్వసిస్తున్న సిద్ధాంతం మంచిదే కావచ్చు! కాని, ఎనభైఏళ్లపాటు నియమ నిష్ఠలతో జీవితం గడిపి, ఈ వయసులో ఏకాదశి ఉపవాసం చేసి, ద్వాదశి భోజనం మంచంమీద తినటానికే బాధ పడుతున్న ఈ వృద్ధురాల్ని అన్యకులస్థురాలైన తన చేతిభోజనం పెట్టి మోసగించటం ఎలా? ఎదిరించటం కంటె మోసగించటం మరీ దారుణమైన పని!



వర్షాకాలంలో మీ చెక్కతలుపులు, కిటికీలు తడిసి బిగుసుకుంటున్నాయా? వాటి అంచులకి సబ్బుని కాని, మైనాన్ని కాని పుయ్యండి. ఇంక మీరు తలుపుల్ని సులభంగా తెరుచుకోవచ్చు మూసుకోవచ్చు.

శ్రీలక్ష్మి చివరికి ఒక నిశ్చయానికి వచ్చి, ధైర్యం కూడదీసుకుంటూ, "నన్ను క్షమించండి, బామ్మగారూ!" అంది.

బామ్మ తెల్లబోయింది! "ఏమిటమ్మా, వనిమాలా ఈ క్షమార్పణలేమిటి?" అంది.

శ్రీలక్ష్మి యిక ఏమీ దాచలేదు! అంతా పూసగుచ్చినట్టు బామ్మకి చెప్పేసింది. "మేం బ్రాహ్మణులంకాదు, బామ్మగారూ!" అన్న మాట శ్రీలక్ష్మి నోటినించి వినే సరికే బామ్మకి సర్వ ప్రపంచం తల్లకిందులయినట్టయింది! మిగతా కథంతా వినేసరికి సజీవ ప్రతిమలా నోట మాట లేకుండా అయిపోయింది!

"నన్ను నమ్మండి, బామ్మగారూ! మీకు ఆయన అంటే పంచ ప్రాణాలనీ, ఆయనతప్ప మీకు ఎవరూ లేరనీ తెలిశాక, మరొక అమ్మాయిని చేసుకోమని ఎంతగానో చెప్పాను! ఆయన వినలేదు! నేనూ ఆయన్ని వదిలి వెళ్లిపోలేకపోయాను! నేను మీకులందాన్ని కాక పోవచ్చు కాని ఆర్ష ధర్మం పట్ల అనురక్తురాల్ని! పూర్తి శాకాహారిని! మా మామయ్య పెంపకంలో సమస్తమూ నేర్చుకున్నాను! నన్ను యీ యింటి కోడలిగా రానివ్వండి! ఆత్మీయులు లేనినాకు దొరికిన ఆయన అభిమానం నించి దూరం చెయ్యకండి!" అంటూ ప్రాధేయపడింది.

చిట్టచివరికి బామ్మ నోరు విప్పింది. "నువ్వెవరో నాకు చెప్పకుండా వుండాలని మీరు నిశ్చయించు కున్నప్పుడు, హఠాత్తుగా యిదంతా నువ్వు నాకెందుకు చెబుతున్నట్టు?"

"ఇప్పటిదాకా నేను మీతో చనువుగా మసలినా నాచేతి మంచినీళ్లు కూడా మీకు యివ్వలేదు! మీ ఆచారాలు, నియమాలు నాకు తెలుసు! అయినా మీకు దెబ్బ తగిలిన ఖంగారులో అవన్నీ మర్చిపోయి, మీకు నా చేతి భోజనం పెట్టబోయాను! కాని మీరు ఏకాదశి ద్వాదశి అనటంతో నాకు స్పృహ వచ్చినట్టు అయింది! ఆయన మిమ్మల్ని ఎదిరించి నన్ను చేసుకున్నా ఫర్వాలేదు! కాని, యీ అబద్ధాలతోనే మిమ్మల్ని ఒప్పించి చేసుకోవటాన్ని మాత్రం నేను అంగీకరించలేను! అది దొంగతనంగా వెన్నుపోటు పొడవటం అనిపిస్తుంది నాకు! అందుకే..ఆ ఉద్దేశ్యంతోనే మిమ్మల్ని మోసగించి నాచేతి భోజనం పెట్టలేకపోయాను! అంతా మీకు చెప్పాను మీరు అంగీకరిస్తే నేనే పెడతాను! లేకపోతే, మీ మనవడు వెళ్లిన చోటు నాకు తెలుసు, వెళ్లి ఆయన్ని తీసుకొస్తాను!" అంది శ్రీలక్ష్మి. బామ్మ ఏమీ మాట్లాడలేదు! మౌనంగా కళ్లు మూసుకుని సమాధిలో కూర్చున్నట్టు కూర్చుంది!

చాలాసేపు ఎదురు చూసిన శ్రీలక్ష్మి నిశ్శబ్దంగా అక్కణ్ణించి లేచి వెళ్లబోయింది!

ఇంతలో బామ్మ కళ్లు తెరిచి, "ఎక్కడికి వెళుతున్నావ్?" అంది.

"మీ మనవణ్ణి తీసుకురావటానికి...."నిర్లిప్తంగా అంది శ్రీలక్ష్మి. బామ్మ నవ్వి "అక్కర్లేదులే! అన్నం తీసుకురా!" అంది

శ్రీలక్ష్మి సంభ్రమంగా చూసింది. బామ్మ నవ్వుతూ, "పరాయింటి పిల్లవిగదా అని ఇందాక కాస్త మొహమాట పడ్డాను! నా మనవడికి కాబోయే భార్యవి, ఇంక మొహమాట పడకుండా హాయిగా తింటాను! అక్కడే చిన్న జాడీలో నిమ్మకాయ వుంది, కాస్త వెయ్యి, పుల్ల పుల్లగా బావుంటుంది!" అంది.

శ్రీలక్ష్మి చెమర్చిన కళ్లు తుడుచుకుంటూ సరేనన్నట్టుగా తలవూపి కణ్వాశ్రమంలో లేడిపిల్లలా గెంతులేస్తున్న మనసుతో వంటింట్లోకి పరిగెత్తింది.

• • •

"బావుంది! ఇదంతా జరిగి వారం రోజులైనా నువ్వు నాకు చెప్పలేదు! ఇంతకీ నిన్నటినించీ తాళం పెట్టుకుని నాకు చెప్పకుండా ఎక్కడికి వెళ్లినట్టు!" గణపతి చిరుకోపంగా అడిగాడు. శ్రీలక్ష్మి నవ్వుతూ. "బామ్మగారు మీకు చెప్పొద్దన్నారు! తనని యింక యిలా ఎన్నాళ్లు ఆడిస్తాడో చూస్తానన్నారు! నిన్న మధ్యాహ్నం నా ఫ్రెండ్ ఒకమ్మాయి బెజవాడ నించి వచ్చింది! ఈ వూళ్లో, యివేళ పొద్దున్న వాళ్ల పిన్ని గారమ్మాయి పెళ్లి! చాలా కాలానికి కలిశామని నన్ను బలవంతంగా లాక్కుపోయింది! యింటికొచ్చి బామ్మ గారికి చెప్పి వెళ్లాను! ఇవేళ సాయంత్రం రిసెప్షన్ అయ్యాక, రాత్రికి వస్తానని మీతో చెప్పమనికూడా చెప్పాను! ఆవిడేమో కథ యిలా నడిపించారు!" అంది.

"కథ ఎలా నడిచినా బామ్మ చెప్పినట్టు అంత బాధ పడిన తర్వాత ఈ నిశ్చింత తాలూకు హాయి మరింత పెరిగింది! జన్మ జన్మలకీ యిలాగే వుండి పోవాలనిపిస్తోంది!" అంటూ శ్రీలక్ష్మిని మరింత దగ్గరకి లాక్కున్నాడు గణపతి.

తరానికి తరానికి నిరంతరంగా సాగే యుద్ధంలో, మానవత్వంతో గెలిచిన పాతతరం వెచ్చగా దుప్పటి లోనూ, మంచి తనంతో గెలిచిన యువతరం ఒకరి చేతుల్లో ఒకరూ, కులమతబేధాలూ, బీదా గొప్పా తారతమ్యాలూ తెలియని గూటిలో గువ్వల్లా నిశ్చింతగా ఒదిగిపోయారు. □